

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి 8లో..

రామగుండంలో వీధి దీపాల నిర్వహణ గాలికి.. 8లో..



రాఘవపూర్ పాఠశాల ఆవరణలో నిలిచిన వరద నీరు



రాఘవపూర్ గ్రామానికి వెళ్లే దారిలో బ్రిడ్జి పారుతున్న వర్షపు నీరు



వరదనీటిలో మునిగిన పంట పొలాలు



జలమయమైన కొలనూర్ రోడ్డు

స్తంభించిన జనజీవనం

• పొంగిపొర్లుతున్న వాగులు • నీట మునిగిన పంటలు • ఎల్లంపల్లి నుంచి లక్షా 45 వేల క్యూసెక్కుల నీటి విడుదల



మత్తడి పారుతున్న అప్పన్నపేట చెరువు

పెద్దపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో శనివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 6 గంటల వరకు భారీ వర్షం కురియడంతో వాగులు వంకలు పొంగుతున్నాయి. మానేరు నది కూడా పొంగిపొర్లుతుండడంతో దానిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ల మీదుగా వరద నీరు పారుతున్నది. దీంతో వరి, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి సమీపంలో రాజీవ్ రహదారి పైకి వరద నీరు రావడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జమ్మికుంటకు వెళ్లే కాల్వ శ్రీరాంపూర్,మల్యాల రోడ్డుపై వరద నీరు చేరింది. పెద్దపల్లి మండలం కొత్తపల్లి, జూలపల్లి మండలం వడుకాపూర్ వద్ద గల కల్వర్టుల మీదుగా వరద నీరు పారు తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా 51.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయింది. ఎలిగేడు మండలంలో 109.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జూలపల్లి మండలంలో 80.8మి.మీ., సుల్తానాబాద్ మండలంలో 77.6మి.మీ., ఓదెల మండలంలో 74.9మి.మీ., పెద్దపల్లి మండలంలో 68.7మి.మీ., కమాన్‌పూర్ మండలంలో 62.0మి.మీ., రామగుండం మండలంలో 50.6 మి.మీ., పాలకుర్తి మండలంలో 48.1మి.మీ., అంతర్గాం మండలంలో 36.5 మి.మీ., కాల్వశ్రీరాంపూర్ మండలంలో 32.5 మి.మీ., ముత్తారం మండలంలో 27.5మి.మీ., ధర్మారం మండలంలో 25.0 మి.మీ., రామగిరి మండలంలో 18.9మి.మీ., మంథని మండలంలో 9.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షాలతో ఆదివారం ఉదయం 6 గం టలకు నుంచి 11 గంటల వరకు ఇళ్ల నుంచి ప్రజలు బయటకి రాలేదు. జిల్లా అధికార యంత్రాంగం కూడా ప్రజలను అప్రమత్తం చేసింది.

పెద్దపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. దస్తగిరిపల్లి కొత్తపల్లి మధ్య ఉన్న లోలెవెల్ బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమై రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపి వేశారు. అలాగే రాగినేడు ఊర చెరువు వర్షానికి నిండుకోవడంతో మత్తడి పారుతోంది. మారేడుగొండ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన వెంకట్రావ్‌పల్లికి వెళ్లేందుకు వరదనీరు ప్రవహిస్తుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అప్పన్నపేట గ్రామచెరువులోకి వరదనీరు చేరడంతో మత్తడి పారుతోంది. రాఘవపూర్ గ్రామానికి వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా అధిక వర్షాలు కురవడంతో బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహించి ప్రజలకు ఇబ్బందిగా ఏర్పడింది. అలాగే రాఘవపూర్‌లో వరద నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో వరిపొలాలు నీటమునిగాయి. పెద్దబొంకూర్ గ్రామంలో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు అప్రమత్తమై రక్షణ ప్రాంతాలకు చేరుకున్నారు.

అత్యవసరం అయితేనే బయటికి రావాలి

భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అత్యవసరం అయితేనే ఇంటి నుంచి బయటికి రావాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని బొంపల్లి, అప్పన్నపేట,రంగాపూర్, సబ్బితం గ్రామాల్లో పర్యటించారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఓదెల: మండలంలో శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షానికి గ్రామాల్లోని ప్రధాన రహదారులు, వీధులు జలమయమయ్యాయి. అలాగే కొమిరలో కొలిపాక మల్లమ్మ అనే మహిళకు చెందిన ఇల్లు పూర్తిగా తడిసి నేలమట్టమయింది. దీంతో మహిళ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. ఓదెలతో పాటు ఇతర గ్రామాల్లో గ్రామ వీధులన్ని నీటితో నిండిపోయాయి. అలాగే కొలనూర్ ప్రధాన రహదారి నీటిలో మునిగి పోవడంతో వాహనదారులంతా భయంతో రాకపోకలను కొనసాగించారు. అలాగే ఓదెల, ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిల నిండా వరదనీరు వచ్చి చేరడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉధృతంగా కురిసిన వర్షానికి వరి, ప్రత్తి పంటలు మునిగిపోయి ఆనవాల్లను కోల్పోయాయి. తహసీల్దార్ యాకయ్య, ఎస్సై అశోక్ రెడ్డి మాట్లాడుతూ మానేరు వాగులోకి చేపలు వేటకు కానీ, దాటేందుకు ప్రయత్నాలు చేయుటకు వెళ్లకూడదని కోరారు.

కాల్వశ్రీరాంపూర్: భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు రోడ్లెక్కి పారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని గంగారం పెగడపల్లి మధ్యలో కాజ్‌వే పైనుంచి నీరు పొంగి ప్రవహించింది. మల్యాల శివారులో జమ్మికుంటకు వెళ్లే దారిలో మొట్లపల్లి, కొత్తపెల్లి, మీర్జపేటకు వెళ్లే దారులలో ఉన్న కాజ్‌వేలపై నుంచి ఒర్రెలు ఎక్కి పారడంతో సుల్తానాబాద్, జమ్మికుంట నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు వచ్చే బస్సులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. మీర్జంపేట, చిన్న రాతుపల్లి గ్రామాల్లోని పలు ఇండ్లలోకి నీరు వచ్చి చేరింది.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్ చెందిన ప్రభుత్వ ఉద్యోగి కారోబార్ చెప్యాల పవన్ మీర్జంపేట గ్రామంలో విధులు ముగించుకొని వస్తుండగా మార్గమధ్యలో కొత్తపెల్లి శివారులో నక్కలవాగులో పడి కొట్టుకపోగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గల్లంతైన పవన్ కోసం రెస్క్యూ టీం ద్వారా గాలింపులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కాల్వశ్రీరాంపూర్‌లోని పవన్ ఇంటికి వచ్చి కుటుంబసభ్యులను ఓదార్చారు. పవన్ కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మాజీ జెడ్‌పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ధర్మారం: ధర్మారం మండలంలో రెండురోజుల నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి చెరువులు, కుంటలు నిండి మత్తడిపై నీరు ప్రవహిస్తోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి అక్కడక్కడా వరి నాట్లు వేయడం ఆగిపోయాయి. అంతేకాకుండ రోడ్లు సైతం బురదమయమై నడవలేని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కమాన్‌పూర్: మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 6.8సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గుండారం రిజర్వాయర్‌కు గౌరిగుండం ద్వారా భారీగా వరదనీరు చేరడంతో పూర్తి స్థాయిలో నీటిమట్టంతో కళకళలాడుతోంది. కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు నుంచి కమాన్‌పూర్‌కు వెళ్లే దారిలో కృష్ణం పల్లెలో ప్రధాన రహదారిపై సుమారు రెండు అడుగుల వరద చేరడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. గుండారం, కిష్టంపల్లి తదితర గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరింది. గుండారం రిజర్వాయర్ నీటమట్టం 12 అడుగులు కాగా అది పూర్తి స్థాయిలో నిండుకుండలా మారింది. దీంతో మాట్లాడి నుంచి నీరు బండలవాగులోకి చేరుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత ఇళ్లలో ఉండకూడదని మండల తహసీల్దార్ అరిపోద్దీన్ తెలిపారు. మరోరెండు రోజులు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలుపుతోంది. చాలా గ్రామాల్లో రోడ్లు బురదమాయంగా మారాయి.

ముత్తారం: మండల పరిధిలోని ఓడేడు, ఖమ్మం పల్లి, పారుపల్లి గ్రామాల శివారులో మానేరు ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గోపతి నరేష్ సూచించారు. ఆదివారం ఓడేడు శివారులోని మానేరు రోడ్డున పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న తాత్కాలిక రోడ్డు లేనందున మానేరు దాటేందుకు ఎవరు ప్రయత్నం చేయద్దన్నారు. అలాగే మానేరు అవతల వైపు ఉన్న పొలాల వద్దకు రైతులు వెళ్లవద్దని కోరారు. చాపల వేట చేయరాదని, అలాగే గ్రామాల్లో సైతం విద్యుత్ స్తంభాల వద్ద ఉండవద్దని చిన్నచిన్న కుంటలు, చెరువులు తెగే ప్రమాదంలో ఉంటే వాటి నుంచి దూరంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్ల నుంచి సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలని కోరారు. మరో రెండురోజులు భారీ వర్షాలు సూచనల మేరకు మండల ప్రజలకు రక్షణ చర్యలు చేపడతామని వారు అన్నారు.

కోల్‌సిటీ: రామగుండంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. 8సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. భారీవర్షంతో నగర జీవనం అతలాకుతలం అయ్యింది. స్థానిక నాలాలు పొంగిపొర్లాయి. ఫైవింక్లయిన్ వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం కూడా భారీ వర్షం కురిసింది. ఎల్లంపల్లి గేటు ఎత్తి దిగువకు నీళ్లు వదలడంతో గోదావరిలో ఉన్న జనగామకు చెందిన 20మంది రైతుల మోటార్లు, పైపులు కొట్టుకుపోయాయి. సుమారు రూ.10 లక్షల నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మూడేళ్లుగా వరుసగా తమ మోటార్లు, పైపులు కొట్టుకుపోయాయన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు ముందస్తు సమాచారం లేకుండా 20గేట్లు ఒకేసారి ఎత్తారని ఆరోపిస్తున్నారు. గతంలో గోదావరి పరిసర ప్రాంతాల ప్రజలను వర్షాలు పడితే అప్రమత్తం చేసేవారని, చాటింపు కూడా చేసేవారన్నారు. ఈ సారి ఎలాంటి సమాచారం లేకుండా గేట్లు ఎత్తారన్నారు.

ఎలిగేడు : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. చెరువులు, కుంటలు నిండి, లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగిపోయాయి. మండలంలోని నారాయణపల్లి గ్రామంలో భారీవర్షం కారణంగా అంగన్వాడీసెంటర్, దూడ వీరేశం, కట్ల లక్ష్మి, సుంక శ్రీధర్ తదితరుల గృహాల్లోకి నీరు వచ్చి చేరింది.

సుల్తానాబాద్ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా జనజీవనం స్తంభించిపోయింది. పలు రోడ్లు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపోగా మరికొన్ని కాలువలు జామ్ అయ్యాయి. సుల్తానాబాద్ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం తొమ్మిదన్నర గంటలకు కరెంట్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గట్టేపల్లిలో కొన్ని ఇండ్లలోకి వరద నీరు చేరి అసౌకర్యానికి ఇబ్బందులకు గురయ్యారు. సుల్తానాబాద్ పట్టణంలోని సాయిబాబా గుడి ప్రాంతంలో రోడ్ల పైకి వరద నీరు చేరింది. గాంధీనగర్ ప్రాంతంలోని పలు కుంటల నుంచి నేరుగా కాలువల ద్వారా చెరువులోకి చేరాల్సిన వరద నీరు రోడ్లపై ఇళ్ల ముందుకు చేరింది. పాత జెండా తదితర ప్రాంతాల్లో నీరు నిలిచింది. సమస్య ఏర్పడ్డ ప్రాంతాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు చేరుకుని వాటిని పరిష్కరించారు. కుండపోత వర్షాలకు మండలంలోని నీరుకుళ్ల మానేరు నది వరదనీరుతో పొంగిపొర్లుతోంది. మానేరులో నిర్మించిన చెక్‌డ్యామ్ నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. మానేరు నదిలో ఉన్న మానేటి రంగనాయకుల స్వామి ఆలయం వరకు నీరు చేరింది. మండలంలోని గర్రెపల్లి పెద్ద చెరువులో పెద్దఎత్తున వరద నీరు మత్తడి పొంగి పొర్లుతోంది. కుండపోత వానలతో సమీప చెరువులు కుంటలు నిండి ఆ వరద నీరంతా రాజీవ్ రహదారి మీదకు వస్తోంది. మండలంలోని కాట్నపల్లి-నర్సయ్యపల్లి గ్రామాల మధ్య రాజీవ్ రహదారిపై వరదనీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

పెద్దపల్లిటౌన్ : రెండు రోజులు కుస్తున్న వర్షాలతో పట్టణ ప్రజలు భయాందోళనకు గరువుతున్నారు. శనివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఓ మోస్తరుగా కురిసిన వర్షం మధ్యాహ్నం నుంచి భారీగా కురిసింది. పట్టణంలోని మురుగు కాలువలన్నీ పొంగిపొర్లాయి. రంగంపల్లి వద్ద రాజీవ్ రహదారిపై పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీంతో మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. కలెక్టర్ శ్రీకోయ హర్ష, ట్రాఫిక్ సీఐ అనీల్, సీఐ ప్రవీణ్ కుమార్‌లు పరిశీలించి వాహనాలను దారి మళ్లించారు. జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించారు. పలుచోట్ల షాపులు, ఇళ్లలోకి వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది.



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం



కొత్తపల్లి-దస్తగిరిపల్లి మధ్య దారిని మూసివేసిన అధికారులు



నారాయణపల్లిలో ఇళ్లలోకి చేరిన వరద నీరు



కొమిరలో కూలిపోయిన ఇల్లు



పెద్దపల్లి పట్టణంలో మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యలు



సుల్తానాబాద్‌లో జలమయమైన జవహర్‌నగర్

ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, సెప్టెంబరు 1 : రాష్ట్రంలో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో పెద్దపల్లి-భూపాలపల్లి జిల్లాల్లోని మంథని నియోజకవర్గంలోని గోదావరి నది లోతట్టు పరివాహక ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం సూచించారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హెడ్‌క్వార్టర్‌లో ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, గోదావరి, మానేరు నదుల వద్ద వరద నీటి ఉధృతిని పరిస్థితిని గమనించాలన్నారు. పశువుల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారు, విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



మత్తడి పారుతున్న రాగినేడు చెరువు

కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలి

- ఎప్పటికప్పుడు అధికారులు పర్యక్షించాలి - ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ, సెప్టెంబరు 1: భారీ వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని రామగుండం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమతమ ప్రాంతాల్లో అలర్ట్‌గా ఉండి ప్రజలకు ఏ ఇబ్బందులు కలిగినా సహాయక చర్యల్లో పాల్గొనాలని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా, రామగుండం నియోజకవర్గ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా భారీ వర్షాలతో చెరువులు నిండినందున ప్రజలు, రైతులు కనిపెట్టుకుంటూ ఉండాలన్నారు. అధికారులందరూ ఎప్పటికప్పుడు సహాయ చర్యల్లో ఉంటారని, జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లిటౌన్,సెప్టెంబరు 1: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, విద్యుత్ స్థంభాలను, వైర్లను, విద్యుత్ పరికరాలను తాకరాదని సూచించారు. చెరువులు, కుంటల వద్దకు సెల్ఫీల పేరిట ప్రమాదం కొనితెచ్చుకోవద్దని సూచించారు. పురాతన ఇళ్లలో ఉన్నవారు సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని, దానికి అవసరమైన చర్యలు అధికారులు బాధ్యత తీసుకుంటారని, స్థానిక మున్సిపాల్టీ లేదా గ్రామపంచాయతీ అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. సురక్షిత ప్రాంతాల్లో ఉంచేందుకు వారు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు నేపథ్యంలో ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య, రెవెన్యూ, పోలీస్, శాఖల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 1: హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆదివారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. అమలుకు నోచుకోని హామీలనిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఏ గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగిందా చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దమ్ముంటే ధరణిని రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జ్వరంతో మహిళ మృతి

ముత్తారం, సెప్టెంబరు 1: మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీలత (45) జ్వరంతో మృతిచెందింది. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న శ్రీలతను హను మకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెం దినట్లు భర్త శ్రీనివాస్ తెలిపారు. ఆమెకు భర్త, కొడుకు కూతురు ఉన్నారు.

శ్రీలత(ఫైల్)

విద్యుదాఘాతంతో వృద్ధురాలు..

రామగిరి, సెప్టెంబరు 1: మండలంలోని రాజాపూర్ గ్రామంలో విద్యుదాఘతంతో అంకం రాజమ్మ(65) అనే వృద్ధురాలు మృతిచెందింది. ఆదివారం ఉదయం 9.00 గంటల ప్రాంతంలో ఇంటి ఎదుట రేకుల షెడ్డులో బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి పెద్దకొడుకు సదానందం ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: మనీ యాప్‌లు వేధించడంతో కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన తుండ్ల శ్రీనివాస్(30) ఇటీవల పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్ అవివాహితుడు.

ఇద్దరిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, సెప్టెంబరు 1: చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో ఆది వారం ఇద్దరు వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బద్దం మల్లారెడ్డి, మధు బస్టాండ్ వద్ద ఉన్నారు. అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క ఇద్దరిపై దాడి చేసి గాయపరిచింది. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, సెప్టెంబరు 1: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి గౌడ శంకర్ (54) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గౌడ శంకర్ ఒంటరి జీవితం గడపడమే కాకుండా అనారోగ్యానికి గురి అయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పట్టివేత

భగత్‌నగర్, సెప్టెంబర్ 1: కరీంనగర్-2 డిపో బస్సు నెం.టిఎస్ 02 యుసి6250లో కండక్టర్ బ్యాగును దొంగిలించిన బి.రమేష్ అనే వ్యక్తిని ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది బస్‌స్టేషన్‌లో పట్టుకుని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ లక్‌పతి, సెక్యూరిటీ గార్డ్ జి కవిత, ఆన్‌డ్యూటి కంట్రోలర్ ఐసిఎస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

ఉమ్మడి జిల్లాలో శనివారం రాత్రి నుంచి జోరు వర్షం కురిసింది. దీంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువులు, కుంటలు మత్తడి పడుతున్నాయి. వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద నీరు

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 83,636 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 64.768టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,325 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

● వరద కాలువకు నీటి విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆదివారం సాయంత్రం వరద కాలువకు నీటిని వదిలారు. హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి వరద కాలువ దిగువకు 1,500 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. కాగా నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోందని, గోదావరి నదీ పరిసరాల ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సారెస్పీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా చేపలు పట్టేవారు, రైతులు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని కోరారు. అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.


ఎల్‌ఎండీకి పెరిగిన ఇన్‌ఫ్లో


నీటితో కళకళలాడుతున్న దిగువ మానేరు జలాశయం

తిమ్మాపూర్, సెప్టెంబరు1: ఎడతేరపి లేకుండా కురుస్తున్న భారి వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. శనివారం రాత్రి 9గంటల సమయం వరకు ఎల్‌ఎండిలోని మోయతుమ్మెద వాగు నుండి కేవలం 1100 క్యూసెక్కు నీరు రాగా, ఆదివారం ఉదయం 6గంటల సమయంలో 2,716 క్యూసెక్కులకు, 9గంటలకు 12,206క్యూసెక్కులకు, మధ్యాహ్నం 2గంటల ప్రాంతములో 15,595, 3గంటలకు 29,879, సాయం త్రం 5గంటలకు 39,047 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి తొమ్మిదిగంటలకు 15,937 క్యూసెక్కులకు తగ్గింది. ప్రా జె క్టులోకి మొత్తం ఇన్‌ఫ్లో 18,320 క్యూసెక్కులు ఉంది. ఎల్ ఎండీ పూర్తి స్థాయి స్థామర్థ్యం 24.034 టీఎంసీలకు కాగా ప్ర స్తుతం 14.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను అధికా రులు నిలిపివేశారు.

మిడ్ మానేరుకు వరద ఉధృతి

బోయినపల్లి, సెప్టెంబరు 1: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 46,891 క్యూసెక్కుల నీరు చేరుతోంది. 6,550 క్యూసెక్కుల నీటిని బయటకు వదలుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 16.215 టీఎంసీల మేరకు ఉంది. కాగా తుపాన్ ప్రభావం వల్ల ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో పెరిగితే ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు నీటి విడుదలను పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు కింద ఉన్న మానేరు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


మిడ్ మానేరు ప్రాజెక్ట్


ఎల్లంపల్లి నుంచి దిగువ గోదావరిలోకి వదులుతున్న నీరు

శ్రీపాద ఎల్లంపల్లి గేట్లు ఎత్తిన అధికారులు

పెద్దపల్లి/ధర్మారం/అంతర్గాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఆదివారం తెల్లవారుజాము వరకు పెద్ద ఎత్తున వరద నీరొచ్చి చేరింది. క్యాచ్ మెంట్ ఏరియా, కడెం ప్రాజెక్టు నుంచి 1,15,074క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా,20 గేట్లు ఎత్తి 1,15,074 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతు న్నారు. దీంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. వరద ప్రవాహాన్ని బట్టి నీటిపారుదల శాఖ అధికారులు గేట్లు ఎత్తుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20. 175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17,813 టీఎంసీల నీరు ఉంది. గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు నిషేదాజ్ఞలు జారీ చేశారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	83.636	2.325	80.5	64.768
ఎల్లంపల్లి	1,15.074	1.15.074	20.175	17.813
మిడ్ మానేరు	46,891	6.550	27.54	16.215
ఎల్ఎండీ	18.320	267	24.034	14.376
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

నక్కలవాగులో కొట్టుకుపోయి ఉద్యోగి మృతి


పవన్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: నక్కలవాగులో కొట్టుకుపోయి ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని మీర్జంపేట గ్రామ పరిధిలోని కొత్తపల్లిలో చోటుచేసుకుంది. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్(22) మీర్జంపేట గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు. వార్డుల విభజన సందర్భంగా ఆదివారం ఉద్యోగరీత్యా మీర్జంపేట గ్రామానికి వెళ్లి విధులు నిర్వహించి సాయంత్రం తన స్వగ్రామమైన కాల్వశ్రీరాంపూర్‌కు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తపల్లి శివారులోని నక్కలవాగు రోడ్డుపై పొంగి ప్రవహించడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంతో సహా పవన్ నీటిలో కొట్టుకుపోయాడు. పోలీసులు, కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన గ్రామస్తులు పవన్ కోసం వాగులో గాలింపులు చేపట్టారు.సంఘటన స్థలానికి వంద మీటర్ల దూరంలో పొదల్లో చికుకుని ఉన్న పవన్ మృతదేహాన్ని రాత్రి పది గంటల ప్రాంతాంలో స్థానికులు గుర్తించారు. చెప్యాల పవన్ తండ్రి చెప్యాల సదయ్య గ్రామ కార్యదర్శిగా పని చేసి అనారోగ్యంతో మృతి చెందడంతో నాలుగు సంవత్సరాల క్రితం పవన్‌కు మీర్జంపేట గ్రామంలో కారోబార్‌గా ఉద్యోగం వచ్చింది. పవన్ గల్లంత కావడంతో అతని తల్లి స్వరూపతో పాటు కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

కూనారం చెరువులో మత్స్యకారుడి గల్లంతు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం చెరువులో పడి మత్స్యకారుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతికల్ గ్రామానికి చెందిన గోస్కుల కుమార్(45) మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చేతి ధర్మయ్య వద్ద పని చేస్తున్నాడు. కునారం పెద్ద చెరువును చేతి ధర్మయ్య లీజుకు తీసుకొని చేపలు వేశాడు. ఆదివారం చేతి ధర్మయ్య దగ్గర పనిచేసే నలుగురు మత్స్యకారులు కునారం పెద్ద చెరువు మత్తడి వద్ద చేపలు బయటికి వెళ్లకుండా వలలు కడుతుండగా ప్రమాదవశాత్తు గోస్కుల కుమార్ చెరువులో పడి గల్లంతయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మానేరులో మత్స్య కార్మికుడు..

గంభీరావుపేట, సెప్టెంబరు 1: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు జలాశయంలో మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన శివరాములు అనే మత్స్య కార్మికుడు గల్లంతయ్యాడు. శివ రాములు ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. లచ్చపేట సమీపాన ప్రవహించే మానేరులోకి వచ్చే పాల్వంచ వాగులో శివరాములు చేపలు పట్టేందుకు వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు. లచ్చపేట వాగు వద్ద శివ రాములు దుస్తులు, పాదరక్షలు లభించడంతో చేపలు పట్టే క్రమంలో గల్లంతయ్యినట్టు గ్రామస్థులు భావిస్తున్నారు.

చెరువు నీటిలోకి వెళ్లి విద్యుత్ లైన్ల మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్

రామడుగు, సెప్టెంబరు 1: భారీ వర్షాలతో రామడుగు మండల కేంద్రానికి ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ నడుము లోతు నీళ్లలో నుంచి నడుచుకుంటూ వెళ్లి చెరువులో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి నుంచి రామడుగులో భారీ వర్షం కురుస్తోంది. గ్రామానికి వచ్చే విద్యుత్ లైన్‌కు సంబంధించిన కొన్ని స్తంభాలు చెరువు సమీపంలో ఉన్నాయి. భారీ వర్షాలకు ఆ స్తంభాల చుట్టూ చెరువు నీరు చేరింది. అందులో ఓ స్తంభం వద్ద లైన్ సాంకేతిక ఇబ్బంది ఏర్పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ భారీ వర్షం కురుస్తున్నా నడుములోతు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లి స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. దీంతో గ్రామానికి విద్యుత్ వచ్చింది. రంజిత్‌ను గ్రామస్థులు, అధికారులు అభినందించారు.

కూలిన రామడుగు బ్రిడ్జి


అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, సెప్టెంబరు 1: శిథిలావస్థకు చేరిన రామడుగు బ్రిడ్జి వరద ప్రవాహానికి ఆదివారం కూలిపోయింది.. స్థానిక అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు, ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాకపోకలను నియంత్రించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో అక్కడికి చేరుకుని బ్రిడ్జిని పరిశీలించారు.. నూతన బ్రిడ్జిలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందించి త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.. అప్పటివరకు రాకపోకలకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. బ్రిడ్జి తెగిపోయిన నేపథ్యంలో ఇటువైపు రావొద్దని ఎస్సై సురేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాలతో తిరుపతి రైలు రద్దు


వెలవెలబోతున్న కరీంనగర్‌రైల్వే స్టేషన్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 1: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలును అధికారులు రద్దు చేశారు. శనివారం రాత్రి తిరుపతి నుంచి కరీంనగర్ బయలుదేరిన రైలు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు విజయవాడ సమీపంలో నిలిపి వేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరాల్సిన రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు రద్దుపై సరైన సమాచారం లేదని, రైల్వే అధికారులు నిర్లక్ష్యమైన సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మపురి వద్ద ప్రమాద స్థాయిలో గోదావరి వరద


ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, సెప్టెంబరు 1: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆదివారం సాయంత్రం ప్రమాద స్థాయికి చేరింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. ఉదయం ఏడు గంటల వరకు ప్రాజెక్టు లోనికి 65,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 10 గేట్లు తెరచి 79,166 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి అధికారులు విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు కడెం ప్రాజెక్టులోకి 32,168 ఇన్‌ఫ్లో కొనసాగడం వల్ల కొంత మేరకు నీరు తగ్గించారు. దిగువ గోదావరి నదిలోకి 18,522 క్యూసెక్కులు విడుదల చేశారు. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగద్దె, మంచి నీటి బావి నీటిలో మునిగిపోయింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తం చేశారు. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, గోదావరి వరద వల్ల ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తగా ఉండాలన్నారు. . కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో
అధికారులు అప్రమత్తంగా ఉండాలి

›› క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి ›› మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాల నేప థ్యంలో ఆదివారం ఉదయం కరీంనగర్ కార్యాల యం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తూ అప్రమత్తం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యా దులకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అక్కడి నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు పంపించాలన్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలుంటాయన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా స త్పతి, జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ ప్రాజెక్టుల నీటి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సంజిత్‌కు మార్ ఝూ, ఎస్పీ అఖిలేష్ మహాజన్‌తో ఎప్పటి కప్పుడు సమీక్షించారు. మిడ్‌మానేరుకు వస్తున్న వరద, ఎగువ మానేరు పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు.

ఎంజేపీ గురుకులంలో విద్యార్థుల ఆందోళన
-మాడిన అన్నం పెట్టారని సాయంత్రం వరకు పస్తులు
-ప్రిన్సిపాల్ ఆదేశాలతో మళ్లీ వండిపెట్టిన నిర్వాహకులు

సైదాపూర్, సెప్టెంబరు 1: సైదాపూర్ మహాత్మాజ్యోతిరావు పూలే (బాలుర) గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం మాడిన అన్నం పెట్టారని విద్యార్థులు ఆందోళన చేశారు. ఆదివారం అన్నం మెత్తగా వండడంతో పాటు మాడిపోవడంతో విద్యార్థులు అన్నం తినకుండా సాయంత్రం వరకు ఉన్నారు. 9,10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఆందోళన చేయడంతో ప్రిన్సిపాల్ ఆదేశాలతో వంటల నిర్వాహకులు మళ్లీ అన్నం వండి పెట్టారు. దాంతో సాయంత్రం అన్నం తినాల్సి వచ్చిందని విద్యార్థులు తెలిపారు. దీనిపై సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా మూడు గంజుల్లో అన్నం వండగా ఒక గంజులో మాడిపోయిన మాట వాస్తవమేనన్నారు. వంటవారిని మందలించి మళ్లీ వండి విద్యార్థులకు పెట్టామన్నారు. చాలా రోజుల నుంచి గిన్నెలు కారుతున్నాయని వంటవారు చెప్పారని, ఆ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూస్తామని తెలిపారు. కాగా సైదాపూర్‌లో సరైన భవనం లేకపోవడంతో సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాలను హుజూ రాబాద్‌లోని బోర్నపల్లి వద్ద బిల్డింగ్ కిరాయికి తీసుకొని నిర్వహిస్తున్నారు. ఆ బిల్డింగ్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, వెంటనే నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి


యూఎస్‌ఎఫ్‌ఐలో చేరిన వారికి కండువా కప్పుతున్న నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1: ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంద గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నప్పటికీ పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమని మండి పడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమిం చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తామని చెప్పి హామీలను విస్మరించారన్నారు. తక్షణమే ప్రభుత్వ విద్యాలయా లను సందర్శించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం ఉత్తర తెలంగాణకు సంబంధించిన వివిధ విద్యార్థి సంఘం నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన నాయకులు యుఎస్‌ఎఫ్‌ఐ సంఘంలో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా మాజీ నాయకుడు రామగల సురేష్ చేరారు. కరీంనగర్ జిల్లాలో ఉమామహేశ్వర్, మయూరి, అక్షయలతో పాటు ఇతరులు చేరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బి తిరుపతి కుమార్. జిల్లా నాయకులు సంతోష్, మల్లికార్జున, సతీష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం


పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూరులో ఇంట్లోకి వెళ్లిన వర్షపు నీరు


వరదతో నిండిపోయిన ఫ్లైఓవర్లయిన్ రహదారి


కోరుట్లలోని ప్రకాశం రోడ్డులో నిలిచిన వరదనీరు


సైదాపూర్‌లో లోలెవల్ వంతెనపై చిక్కుకున్న ఆటోను తీస్తున్న ప్రజలు


అలుగు పారుతున్న కొత్తపల్లి చెరువు


చిగురుమామిడి మండలంలో ఇంట్లోకి చేరిన వరదనీరు


మత్తడి దూకుతున్న సర్వాయిపేట కొచ్చెరువు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 1: తెలంగాణలో గురుకులాల్లో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రామగుండం ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాంపెల్లి సతీష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం లేక ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురవుతున్నారని అయినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇప్పటివరకు ఒక జత దుస్తులు మాత్రమే ఇచ్చిందని, మరో జత ఇంకా ఇవ్వలేదని, బుక్స్ కూడా కొంత మందికి పార్ట్-1, మరికొంత మందికి పార్ట్-2 ఇచ్చి ఇద్దరు కలిసి చదువుకోవాలని చెప్పడం గురుకులాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించాలని లేకపోతే పేరంట్స్ కమిటీ నాయకులతో ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి, సెప్టెంబరు 1: భారీ వర్షాల కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితి ఉంటే డయల్ 100కు, ఏదైనా మెడికల్ ఎమెర్జెన్సి ఉంటే 108కు కాల్ చేయాలని, పొంగే నాలాల వద్దకు వెళ్లకూడదని, ఎవరైనా పొంగే నాలాలను గుర్తించి తగు సమాచారం ఇచ్చినట్లు అయితే వెంటనే సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేస్తారని, ఏదైనా ఇతర ముఖ్యమైన సమాచారం (భారీ వర్షాల కారణంగా) తెలిసినచో వెంటనే పోలీసు అధికారులకు తెలియజేయాలని ఎస్‌ఐ సూచించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మంథని, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంథని ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్. మల్లయ్య ఆదివారం సూచించారు. తడిచిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, తడి చేతులతో స్టార్టర్లు, మోటర్లు, స్విచ్‌బోర్డులు ముట్టవద్దని, చిన్న పిల్లలు కరెంట్ వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలని, తడి బట్టలు ఇనుప తీగల పై ఆరవేయవద్దని, మురుములు మెరుపులు వచ్చినప్పుడు ఎలక్ట్రాన్స్ వస్తువులను ఆఫ్ చేసి ఉంచాలని, గాలి దుమారంతో తెగిన విద్యుత్ వైర్లను ముట్టరాదని సూచించారు. వీటి విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వ్యవసాయ కూలీ మృతి

కమాన్‌పూర్, సెప్టెంబరు 1 : మండలంలోని జూలపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పొలం పనులకు వెళ్లిన ఓ వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇలాసారం కిరణ్ (37) పొలం పనుల నిమిత్తం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా సొమ్మ రావడంతో పొలంలో పడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన కిరణ్ 20సంవత్సరాలుగా జూలపల్లిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కొట్టే ప్రశాంత్ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

మంథని, సెప్టెంబరు 1: మెయిన్ రోడ్డుపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది ఆదివారం తొలగించారు. బస్టాండ్ నుంచి శ్రీపాదచౌక్ ప్రధాన రహదారి పైకి వచ్చిన షాపుల ముందుకు కప్పులపై ఉన్న రేకులు, తడకలను మున్సిపల్ ఉద్యోగులు తొలగించారు. రోడ్డుపై వచ్చిన ముందు కప్పుల కారణంగా వాహనదారులకు, ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందిగా మారడంతో వాటిని తొలగించారు.

యువకుల రక్తదానం

మంథని, సెప్టెంబరు 1: వాసవి క్లబ్ ఇంటర్నేషన్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేడగోని వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

టీఈఆర్‌సీ మెంబర్‌గా శశిభూషన్‌కాచే

మంథని, సెప్టెంబరు 1:తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండల సలహా కమిటీ సభ్యులుగా మంథనికి చెందిన రైతు నాయకుడు, న్యాయవాది శశిభూషణ్‌కాచేను పునర్ నియమించినట్లు కమీషన్ సభ్య కార్యదర్శి వీ. రాంచందర్ తన ఉత్తర్వుల్లో వెల్లడించారు. మూడు సంవత్సరాలపాటు కాచే టీఈఆర్‌సీ మెంబర్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, కాచే నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మంథని డివిజన్‌లో 128.4 మి.మీ. వర్షపాతం

మంథని, సెప్టెంబరు 1:మంథని డివిజన్‌లో 128.4మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీవో హనుమానాయక్ ఆదివారం తెలిపారు. మంథని మండలంలో 11.8 మి.మీ., కమాన్‌పూర్‌లో 68.6 మి.మీ., ముత్తారంలో 28.4, రామగిరిలో 19.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. డివిజన్‌లో 32.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

అక్షరాస్యత పెంపునకు కసరత్తు

- దేశవ్యాప్తంగా మరో కార్యక్రమం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం - న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం పేరిట నిర్వహణ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం పేరిట దేశవ్యాప్తంగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్రంలో అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహణకు వయోజన విద్యా శాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. 15ఏళ్లకు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వయోజన విద్యా విభాగం ఆధ్వర్యంలో చివరగా సాక్షర భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రాజెక్టు 2019లో ముగియగా, ఆ తర్వాత వయోజన విద్య శాఖ వేరే కార్యక్రమాన్ని రూపొందించ లేదు. తాజాగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉండే నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యతా కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 27 శాతం మంది నిరక్షరాస్యులు ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో 33.46 శాతం మంది, జిల్లాలో 34.48 శాతం మంది ఉన్నారు. రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన సర్వేలో నిరక్షరాస్యులను గుర్తించారు. జిల్లాలో 68,755 మంది, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది వరకు ఉన్నట్లు గుర్తించారు.వీరందరినీ దశల వారీగా 'న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం' పేరిట అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. గుర్తించిన నిరక్షరాస్యుల్లో మొదట 25శాతం మందికి విద్యాబోధన చేయనున్నారు. జిల్లాలో 18,868 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయనున్నారు.

కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ..

కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా విద్యా శాఖాధికారి మెంబర్ కన్వీనర్‌గా, డీఆర్‌డీవో, డీడబ్ల్యూవో, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు మెంబర్లుగా కమిటీ ఉంటుంది. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్లను నియమించనున్నారు. 7,8,9వ తరగతి చదువుతున్న విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ, పీజీ చదివే ఔత్సాహికులైన వలంటీర్లను గుర్తించి వారి ద్వారా సాయంత్రం 6నుంచి 8 గంటల సమయంలో అక్షరాస్యత నిర్వహించనున్నారు. ఎక్కడైతే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయో ఆ గ్రామాల్లో అక్షరాస్యత కార్యక్రమాన్ని మొదట చేపట్టనున్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నడవనున్నది. ఒక టీచర్‌ను సర్వేయర్‌గా నియమించనున్నారు. ఒక్కో వలంటీర్ 10 నుంచి 15 మంది నిరక్షరాస్యులను ఒక దగ్గరికి చేర్చి చదవడం, రాయడం నేర్పించాలి. జిల్లాకు ఒక రిసోర్స్ పర్సన్‌ను ఎంపిక చేసి ఆయనకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఆయన మండల పరిధిలో ఎంపికైన రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇవ్వనున్నారు. వాళ్లు వలంటీర్లకు శిక్షణనిస్తారు. ఈ ప్రక్రియ వచ్చే నెలలో జరగనున్నది. నిరక్షరాస్యులకు చదవడం, రాయడం నేర్పించేందుకు కావాల్సిన పుస్తకాలు, బుక్కులను, ఇతర మెటీరియల్‌ను వయోజన విద్యాశాఖ ద్వారా అందించనున్నారు. అయితే ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. ఈ న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారా వలంటీర్లు, రిసోర్స్‌పర్సన్లు స్వచ్ఛందంగానే పని చేయాల్సి ఉంటుంది. నిరక్షరాస్యులకు కేవలం మెటీరియల్ మాత్రమే సరఫరా చేయనున్నారు. అక్టోబరు లేదా నవంబరు నెల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే సూచనలు కనబడుతున్నాయి. ప్రస్తుతానికైతే వయోజన విద్యా శాఖ అధికారులు, సిబ్బంది, జిల్లా విద్యా శాఖాధికారులను సమన్వయం చేసుకుని జిల్లాలవారీగా ఎంత మంది నిరక్షరాస్యులున్నారు, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందించేందుకు ఎంత మంది ముందుకు వస్తారు తదితర అంశాలపై కసరత్తును మొదలుపెట్టారు.

రామగుండంలో వీధి దీపాల నిర్వహణ గాలికి..

- చేతులెత్తేసిన ఈఈఎస్ఎల్ సంస్థ - ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ సహకారం కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 1: రామగుండం నగరపాలక సంస్థలో వీధి దీపాల నిర్వహణపై ఈఈఎస్ఎల్ సంస్థ చేతులెత్తేసింది. ఈ ఏడాది నవంబర్‌తో నిర్వహణ గడువు ముగుస్తుండగా ఆరు నెలల ముందు నుంచే మెటీరియల్ సరఫరా నిలిపివేసింది. ఈఈఎస్ఎల్ సబ్ కాంట్రాక్టర్లు కార్పొరేషన్ స్ట్రీట్‌లైట్స్ మెయింటనెన్స్‌ను గాలికి వదిలేశారు. వారెవరూ కార్పొరేషన్ వైపు కూడా చూడడంలేదు. సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వడం లేదు. కార్పొరేషన్‌లోని సెంట్రల్ లైటింగ్, కూడళ్లలోని హైమాస్‌లైట్లు చాలా వరకు వెలగడం లేదు. ఒక సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించే 242 మరమ్మతుల్లో ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పరిస్థితి దిగజారుతున్నా కార్పొరేషన్ ముందస్తు చర్యలు చేపట్టలేకపోయింది. దీంతో ప్రధాన వీధులు చీకటిమయం అయ్యాయి. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ దిద్దుబాటు చర్యలకు దిగారు. అత్యవసరంగా లైట్లు సమకూర్చాలంటూ ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీకి సూచించారు. స్పందించిన ఆర్ఎఫ్‌సీఎల్ 150 లైట్లను అందజేసింది. వీధి దీపాల నిర్వహణపై చేతులెత్తేసిన ఈఈఎస్ఎల్ సంస్థ మాత్రం ఇంకా తమకు రూ.1.83కోట్లు బకాయిలు ఇవ్వాలంటూ లేఖలు పెడుతోంది.

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వీధి దీపాల్లో ఎల్‌ఈడీలను వాడాలని నిబంధన పెట్టింది. ఇందుకు గాను ప్రభుత్వరంగ సంస్థ ఈఈఎస్ఎల్ సేవలను వినియోగించుకోవాలంటూ పేర్కొన్నది. ఈ సంస్థే మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో సొంత ఖర్చులతో ఎల్‌ఈడీ వీధి దీపాలను సమకూర్చుతుంది. విద్యుత్ బిల్లుల ఆదా సొమ్మును ఈ సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. ఏడేళ్ల కాలపరిమితిపై అగ్రిమెంట్ చేసుకున్నారు. రామగుండం నగరపాలక సంస్థలో జనవరి 15, 2017 నుంచి ఈ ఒప్పందం అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం అమలులోకి వచ్చే సరికి రామగుండంలో 9309వీధి దీపాలు ఉండేవి. ఆ సంస్థ 2017లోనే పాత వీధి దీపాల స్థానంలో 18వాట్ల ఎల్‌ఈడీలను అమర్చింది.



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఇవే కాకుండా వీధుల కూడళ్లలో 35వాట్లు, 70వాట్ల వీధి దీపాలు ఏర్పాటు చేశారు. సీఎంఏ, ఎల్ఆర్ఎస్ గ్రాంట్లతో రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని, మెడికల్ కళాశాల రహదారి, అడ్డగుంటపల్లి తదితర ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ పెట్టడంతో 90వాట్ల వీధి దీపాలను కూడా సమకూర్చింది. వీటితో పాటు 14చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం వీధి దీపాల సంఖ్య 20327గా ఉంది. 2017 నుంచి మొదట విద్యుత్‌బిల్లుల ఆదా సొమ్ము నెలకు రూ.6 లక్షలతో ప్రారంభమై ఇప్పుడు రూ.14లక్షలు చెల్లించే వరకు వచ్చింది. ఇప్పటివరకు ఈఈఎస్ఎల్ సంస్థకు మున్సిపల్ కార్పొరేషన్ విద్యుత్ ఆదా బిల్లుల పేర రూ.8.80కోట్లు చెల్లించింది. ఆరు నెలల క్రితం నుంచే మెటీరియల్ నిలిపివేసినా ఈ ఏడాది జూన్ వరకు బిల్లులు చెల్లిస్తూనే వచ్చింది. పైగా తమకు అగ్రిమెంట్ 2017 జనవరిలో చేసుకున్నా అమలులోకి వచ్చిన తేదిని పరిగణలోకి తీసుకుంటే ఈ నవంబర్ వరకు నిర్వహణ గడువు ఉంది. కానీ తమకు కంప్లియేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలంటూ ఈఈఎస్ఎల్ సబ్ కాంట్రాక్టర్లు కార్పొరేషన్‌పై ఒత్తిడి తెస్తున్నారు.

సహకరించని సబ్ కాంట్రాక్టర్లు

రామగుండం నగరపాలక సంస్థలో వీధి దీపాల నిర్వహణకు ఈఈఎస్ఎల్ సంస్థతో చేపట్టినా ఆ సంస్థ పేర ఇద్దరు సబ్ కాంట్రాక్టర్లు నిర్వహణ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సిబ్బందిని ఆ సంస్థనే సమకూర్చాల్సి ఉంటుంది. కానీ నగరపాలక సంస్థ ఎలక్ట్రిషియన్లు పది మంది ఈ వీధీదీపాల నిర్వహణలో పని చేస్తున్నారు. సబ్ కాంట్రాక్టర్లు తమ సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించకపోవడంతో నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సబ్ కాంట్రాక్టర్లు రామగుండంలో పరిస్థితిని సమీక్షించకపోవడంతో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తమైంది.

4800 వీధి దీపాల అవసరం

రామగుండం నగరపాలక సంస్థ విస్తరణ, కొత్త కాలనీల ఏర్పాటు, సింగరేణి సంస్థ వీధి దీపాల నిర్వహణను తక్కువ ఏరియాకు పరిమితం చేసుకోవడంతో వీధి దీపాల అవసరాలు పెరిగాయి. ప్రస్తుతం ఉన్న వీధి దీపాలతో పాటు కొత్తగా 4800వరకు వీధి దీపాలు అవసరం ఉన్నాయి. ఇందులో కొత్త పోల్స్‌కే 225 వీధి దీపాలు పెట్టాల్సిన పరిస్థితి. ఇప్పటికే ఉన్న వీధి దీపాలు ఏడేళ్ల క్రితం సరఫరా చేసినవి కావడంతో సామర్థ్యం పడిపోయింది. ఒక్కో సెట్‌లో సగం బల్బులు కూడా వెలగని పరిస్థితి ఉంది. దీంతోపాటు సెంట్రల్ లైటింగ్ వీధి దీపాలు పెట్టిన కాంట్రాక్టర్లు గడువు ప్రకారం నిర్వహణ చేయలేకపోతున్నారు.

మెటీరియల్‌కు టెండర్లు

రామగుండం నగరపాలక సంస్థలో 20వేలకు పైగా వీధి దీపాలు ఉండగా రూ.5లక్షల మెటీరియల్‌కు టెండర్లు పెట్టారు. ఇది ఏ మూలకు కూడా సరిపోయే పరిస్థితి లేదు. మార్కెట్ రేటుకు, కార్పొరేషన్ కొటేషన్లకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. ఆర్ఎఫ్‌సీఎల్ రూ.5లక్షల వ్యయంతో ఐదేళ్ల వారంటీతో 90 వాట్ల సామర్థ్యం గల 150 ఎల్‌ఈడీ లైట్లను కార్పొరేషన్‌కు ఇచ్చింది. కార్పొరేషన్ అంచనాల్లో 40 నుంచి 50మాత్రమే వచ్చే అవకాశం ఉందనడంతో ఆర్ఎఫ్‌సీఎల్‌నే నేరుగా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. గతంలో రామగుండం మున్సిపాలిటీగా ఉన్న సమయంలో వివిధ పేరెన్నికగన్న కంపెనీ ప్రనిధులతో చర్చలు జరిపి తక్కువ రేటుపై వారంటీ పీరియడ్‌తో కొనుగోలు చేసేవారు. రానురాను పరిస్థితులు తారుమారయ్యాయి.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 1 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్న పెద్ద సంఘం ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ అని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి త్వరలోనే ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిపడిన నాలుగు విడతల కరువు భత్యంలలో రెండు విడతలను విడుదల చేయనుందన్నారు. ఉద్యోగుల నూతన హెల్త్‌స్కీం అమలు, బీఈడి చేసిన ఎస్‌జీటీలకు పదోన్నతుల విషయంలో ఈనెల 3వ తేదీన ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సీపీఎస్ రద్దుకు తమ సంఘం కట్టుబడి ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు కృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు. అంతకుముందు శనివారం పదవీవిరమణ పొందిన రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్‌రావును ఘనంగా సన్మానించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బి.రవినందన్‌రావు, పి.శ్రీధర్‌రావు, డి.రఘు, కె. శ్రీనివాస్, ఆకుల రాజన్న, బి.సతీష్ బాబు, ఎం.రాజమౌళి, వి.వెంకటలక్ష్మి, ఎం. నారాయణ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, సీహెచ్ నాగేశ్వర్‌రావు, జాలి రాఘవరెడ్డి, అన్ని మండలాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు, పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో ఆర్జీ-2 ఎస్వోటూ జీఎం మృతి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 1: ఆర్జీ-2 ఎస్వోటూ జీఎం ఎన్ వెంకటేశ్వరరావు ఆదివారం మృతిచెందారు. కొంతకాలంగా మూత్రాశయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వెంకటేశ్వరరావు ఈనెల 28న భూపాలపల్లి ఏరియాకు వెళ్లగా అక్కడ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రిలో చేరగా, మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. ఆపరేషన్ చేస్తున్న క్రమంలో తీవ్ర గుండెపోటు రావడంతో వెంకటేశ్వరరావు కన్నుమూశారు. 5 నెలలుగా ఆర్జీ-2 ఎస్వోటూ జీఎంగా వెంకటేశ్వరరావు విధులు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వరరావు మృతిపై అధికారులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

'గెలిచిన సంఘం తీరుతో కార్మికులకు నష్టం'

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 1: గుర్తింపు సంఘంగా గెలుపొందిన యూనియన్ తీరుతో కార్మికులకు నష్టం జరుగుతున్నట్లు సీఐటీయూ బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, నాయకుడు ఉల్లి మొగిలిలు ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్జీ-2 ఏరియాలో ప్లేడేలు నిలిపివేయబడడానికి ప్రధాన కారణం గెలిచిన సంఘం అని ఆరోపించారు. కార్మికులకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకుని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళాల్సిన బాధ్యతను సదరు నాయకులు విస్మరించారన్నారు. కార్మికులకు గెలిచిన సంఘం నాయకులు అందుబాటులో లేకపోవడంతో ఎవరితో సమస్యలు చెప్పుకోలవాలో తెలియని స్థితిలో కార్మికులు ఉన్నట్లు పేర్కొన్నారు. పైరవీలకు పరిమితం కాకుండా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సీఐటీయూ పక్షాన గెలిచిన సంఘానికి సూచిస్తున్నట్లు వారు ప్రకటనలో పేర్కొన్నారు.

ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో ఆర్జీ-2 యాజమాన్యం కార్మికులకు, కార్మిక కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ ప్రాజెక్టు నిర్ణయం మరుపురాని బహుమానం

- సింగరేణి, జెన్‌కో స్థలాల్లో పట్టాలకు ఆదేశాలు - విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, సెప్టెంబరు 1: రామగుండంలో విద్యుత్ కేంద్రం స్థాపించాలనే ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని, ఇది ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న మరుపురాని బహుమానమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 800మెగావాట్ల ప్రాజెక్టు స్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఏడుగురు శాసన సభ్యులు, సలహాదారు వేణుగోపాల్ సహకారం మరువలేనిదన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు రామగుండం అభివృద్ధికి వెన్నంటే ఉంటున్నారన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమంలో రామగుండం విద్యుత్ కేంద్రం కోసం కొవ్వొత్తులతో నిరసన తెలిపిన కేటీఆర్ అధికారంలోకివచ్చిన తరువాత ప్రాజెక్టును మరిచిపోయారన్నారు. పిట్ హెడ్ స్టేషన్ అయిన రామగుండంలో కాదని ఇక్కడి బొగ్గు, నీరు తరలించుకుపోయి యాదాద్రిలో ప్లాంటు పెట్టారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. ఇది రామగుండం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఎల్లంపల్లి నీటిని తరలించుకుపోయి ఈ ప్రాంత రైతులకు చుక్క నీరు ఇవ్వలేదని, దీనిపై కాంగ్రెస్ బండలవాగు, పాలకుర్తి ఎత్తిపోతల కోసం ఉద్యమం చేశామని, దానిలో భాగంగా బండలవాగు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు మంత్రి భట్టి విక్రమార్క రూ.10కోట్ల మంజూరుకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అదే విధంగా పాలకుర్తి ఎత్తిపోత పథకానికి కూడా రూ.350కోట్లు మంజూరు చేస్తామని హామి ఇచ్చారన్నారు. ఈ రెండు ప్రాజెక్టులతో రామగుండం గ్రామీణ ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని ఆయన తెలిపారు. సింగరేణి ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చి ప్రజలందరికి వైద్యం అందించనున్నామని, ఇందులో భాగంగా త్వరలోనే కార్డియాక్ విభాగాన్ని ప్రారంభిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఓజీ అమలుకు హామీ ఇచ్చారన్నారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న 5వేల కట్టడాలకు, జెన్‌కో స్థలాల్లోని 1600కట్టడాలకు పట్టాలుఇచ్చేందుకు భట్టి విక్రమార్క కలెక్టర్‌ను ఆదేశాలు ఇచ్చారన్నారు. రూరల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రామగుండంలో ఏర్పాటు చేసేందుకు శ్రీధర్‌బాబు చొరవ చూపుతున్నారని, మొదటి దశలో సింగాపూర్‌కు చెందిన కంపెనీ వంద మందికి ఉపాధి ఇవ్వనున్నదని, దశల వారీగా వెయ్యి మందికి ఉపాధి ఇచ్చేందుకు చర్యలు చేపడుతుందని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా త్వరలోనే ప్రారంభించి శిక్షణ ఇస్తామన్నారు. సింగరేణి మెడికల్ కళాశాల పేర మోసాలకు పాల్పడ్డారని, ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించలేకపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి అవసరమున్న నిధులు ఇప్పించి నిర్మాణాలు పూర్తిచేస్తుందన్నారు. మెడికల్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలనే సంకల్పంతో పని చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. టీయూఎఫ్ఐడీసీ, అమృత్ నిధులతో నగరాభివృద్ధితో పాటు ఎస్‌టీపీల నిర్మాణం పూర్తి చేస్తున్నామన్నారు. ఉప ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా సహకరించిన సింగరేణి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో మేయర్ అనిల్ కుమార్, నగర అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్ కుమార్, ముస్తాఫా, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, దూళికట్ట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లఘు చిత్రంగా ఎంపిక

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 1: గోదావరిఖనికి చెందిన దర్శకులు దామెర శంకర్ దర్శకత్వం వహించి నిర్మించిన లఘు చిత్రం ఉత్తమ షార్ట్ ఫిలిం అవార్డుకు ఎంపికయ్యింది. ఈమేరకు 31న హైదరాబాద్‌లో వీకేఆర్ ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ మీడియా ఆధ్వర్యంలో ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన షార్ట్ ఫిలిం అండ్ ఫోక్ సాంగ్స్ అవార్డు-2023 ఫంక్షన్‌లో ఉత్తమ లఘు చిత్రం అవార్డు చిత్రం యూనిట్ అందుకుంది. ఈ చిత్రంలో నటులు మేజిక్‌రాజా, రాపెల్లి కుమార్, గజెల్లి రాజలింగు, అందె సదానందం, దామెర రాజేష్ నటించగా కెమెరామెన్‌గా మెహబూబ్, మేకప్‌మెన్‌గా అంజిబాబు ఉన్నారు. ఖని లఘుచిత్రానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ చిత్రంగా అవార్డు అందుకోవడంపై స్థానిక కళాకారులు అభినందించారు.

ఖని ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

కోల్‌సిటీటౌన్, కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 1: అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీల్లో గోదావరిఖని వాసవ్య విద్యాలయంకు చెందిన ఉపాధ్యాయులు నిశిత, రాధిక, బిందు అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలతో పాటు అవార్డులు అందుకున్నారు. కాగా పాఠశాల డైరెక్టర్ విక్రమ్‌వర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులు సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలి

ఓదెల, సెప్టెంబరు 1 : మండలంలో రుణమాఫీ వర్తించిన రైతులు పేర్లు నమోదు చేయించుకునేందుకు సంబంధిత సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని ఏవో భాస్కర్ తెలిపారు. సోమవారం రైతు వేదికలలో నిర్వహించే వివరాల నమోదుకు రేషన్‌కార్డులు లేని రైతులు బ్యాంక్ స్టేట్మెంట్, బ్యాంక్ పాస్‌పుస్తకం, భూముల పట్టాదారు పాసుపుస్తకం, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డుల జిరాక్స్ కాపీలు, ఒరిజినల్ కాపీలను వెంట తీసుకురావాలని ఏవో కోరారు.

గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి

ధర్మారం, సెప్టెంబరు1: గ్రామీణప్రాంతాల్లో ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. ఆదివారం ధర్మారంలో కె.సి. గుప్తా జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, పలువురికి సన్మానం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సిరిపురం సత్యనారాయణ, జిల్లా గవర్నర్ వి 107ఏ జె. మాధవి, ధర్మారం వాసవి క్లబ్ అధ్యక్షుడు తాటిపల్లి వంశీ, కార్యదర్శి శివ,కోశాధికారి ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాయక స్వామి పల్లకీ సేవ



పల్లకీ సేవలో కోలాటమాడుతున్న భక్తులు

రామగిరి సెప్టెంబరు 1:మండలంలోని లద్నాపూర్ గ్రామంలో శ్రీ గోదా రంగనాయక స్వామి పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ భోల్లపల్లి స్వామిగౌడ్, అర్చకులు సముద్రాల శ్రీనివాసచారి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌ను కలిసిన కోలేటి



శ్రీనివాసులు శెట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోలేటి దామోదర్

కోల్‌సిటీ, సెప్టెంబర్ 1: ఎస్‌బీఐకి నూతనంగా చైర్మన్ అయిన తెలంగాణవాసి శ్రీనివాసులు శెట్టిని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఆదివారం ముంబైలోని ఎస్‌బీఐ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి గ్రూప్ చైర్మన్ ఎర్రం విజయ్‌కుమార్, కేసీ వెంకటేశ్వర్లు, గందె సుధాకర్, సీఏ రాజేష్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కోల్‌సిటీ, సెప్టెంబర్ 1: రామగుండానికి 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం మంజూరుకు కృషి చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను ఆదివారం పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు సత్కరించారు. సంఘం అధ్యక్షుడుబండారి రాజమల్లు ఆధ్వర్యంలో సిరిపురం మాణిక్యం, నర్సయ్య, కానుగంటి నారాయణ, అన్నల్‌దాస్ శ్రీనివాస్, కన్నం ప్రభాకర్, తుమ్మ కొమురయ్య, ఆడెపు రవి, గుండేటి శంకర్, సిరిపురం రమేష్, మాటేటి మౌనిక, బండారి స్రవంతి, ఆడెపు లక్ష్మి ఉన్నారు.

నీట మునిగిన కొదురుపాక వంతెన

సుల్తానాబాద్, సెప్టెంబర్ 1: వరుసగా కురుస్తున్న అతి భారీ వర్షాల మూలంగా మండలంలోని కొదురుపాక బ్రిడ్జి నీట మునిగింది. దీంతో రాకపోకలు స్తంభించి పోయాయి. ఆదివారం కుండపోత వర్షానికి పై నుంచి పెద్దఎత్తున వచ్చిన వరదలకు వంతెన మునిగిపోయింది. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. సోమవారం వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, సెప్టెంబరు 1: సుల్తానాబాద్ పట్టణంలోని పలువురు మృతుల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే విజయరమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిరాజమల్లు పరామర్శించారు. సుల్తానాబాద్ మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్, పల్లా సత్తయ్య శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి మృతుడు సత్తయ్య భౌతిక కాయంపై పుష్పాలు సమర్పించి నివాళుర్పించారు. అలాగే కిషోర్ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడగా, ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం త్వరగా చేయించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మినుపాల ప్రకాశ్‌రావు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోలం అబ్బయ్యగౌడ్, అనిల్, పోచాలు తదితరులు పాల్గొన్నారు.